మూఢ నమ్మకాలతో అనర్థాలు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని శారదా నికేతన్ పాఠశాలలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మ్యాజిక్ షో ద్వారా మూఢ నమ్మకాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక నాయకులు బాల భయ్యన్న, వై.అరుణ రిటైర్డ్ హెచ్ఎం పాల్గొని విద్యార్థులు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని, ప్రశ్నించే తత్వం ఉండాలని సూచించారు. మూఢ నమ్మకాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మూఢనమ్మకాలు నమ్మి చాలా మంది తమ ప్రాణాలను పోగొట్టుకుంటు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ అబివృద్ధి కమిటీ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపల్ ఎస్.చిరంజీవులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న జెవివి నేతలు

ఆందోళన చేపడుతున్న సిఐటియు నేతలు, విఒఎలు

విఒఎల సమస్యలు పరిష్కరించాలి

-సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా వెలుగు వివోఏల (యూనిమేటర్ల) సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు కార్యాలయం నుండి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివోఏలు ధర్నా జరిపారు. వివోఎల జిల్లా అధ్యక్షులు ఆర్.భాను, కార్యదర్శి ఎల్‌బి రాజకుమార్ ఆధ్వర్యంలో జరిగిన. ఈ కార్యక్రమంలో వివోఏల గౌరవ అధ్యక్షులు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌బి పోతురాజు, జిల్లా సహాయ కార్యదర్శి సుందరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ, కనీస వేతనాలు అమలు చేయాలని, బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వెలుగు వివోఎల కాల పరిమితి రద్దు చేయాలని, జీతాలు పెంపు చెయ్యాలని, వారి సొంత ఖాతాలో జమ చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం హయాంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో తమ ప్రభుత్వం వస్తే వెలుగు యూనిమేటర్లకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి యేడాది అయినా అమలు చేయలేదని అన్నారు. జీతాలు పెంచుతామని, కనీస వేతనాలు పెంచాలని, మూడు సంవత్సరా కాల పరిమితి సర్కులర్ రద్దు చేయలేదని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సిసి లుగా ప్రమోషన్ ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ చెల్లించాలని, బకాయి జీతాలు ,కొత్త ఫోన్లు, 5జి సిమ్‌లు, రిచార్జిలు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్ పని భారం తగ్గించి, అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. తొలగించిన వారిని నియమించాలని, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, నూతన యపుల ద్వారా అదనపు పనులు చేస్తున్నప్పటికీ సేవలు గుర్తింపు లేదన్నారు. సకాలంలో జీతాలు అందక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతూ అప్పుల ఊబిలో పడుతున్నారన్నారు. సమస్యలు పరిస్కారం చేయకుంటే భవిష్యత్తులో ఉద్యోగులందరికీ ఐక్యం చేసి పోరాటం ఉధృతం చేస్తామన్నారు. అనంతరం ధర్నా చేస్తున్న కార్మికుల వద్ద ప్రాజెక్టు డైరెక్టర్ రావడంతో సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివోఏ ల యూనియన్ నాయకులు, కోశాధికారి పోతురాజు, జ్యోతి, రవి, వెంకట లక్ష్మి, మహేష్, మల్లేష్, దుర్గ, భాస్కరరావు, సోంబాబు, సువర్ణ, 11 మండలాల వివోఏ లు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి యంత్రాంగం కృషి

- కలెక్టర్ దినేష్ కుమార్ వెల్లడి

ప్రజాశక్తి-పాడేరు : అల్లూరి జిల్లా అభివృద్ధికి యంత్రాంగం కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించారు. అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన జరుగుతున్న రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పాల్గొని జిల్లా అభివృద్ధి నివేదికను తెలియజేసారు. దీనిపై స్థానిక విలేకరులకు ఒక ప్రకటనలో వివరాలు తెలిపారు, అల్లూరి జిల్లాలోని వివిధ గ్రామాలకు తాత్కాలిక పనులకు బదులుగా నిర్మాణాత్మక అభివృద్ధి నమూనా అవసరమని పేర్కొన్నారు. పట్టణాలు, నగరాలు, పట్టణ ప్రణాళిక లేదా పట్టణ అభివృద్ధి అధికారుల ద్వారా పట్టణ ప్రణాళికను అనుసరించినట్లేనని తెలిపారు. గ్రామాలు కూడా "గ్రామ అభివృద్ధి ప్రణాళిక" లేదా "గ్రామీణ ప్రణాళిక చట్రం" నుండి ప్రయోజనం పొందవచ్చని అభిప్రాయపడ్డారు.సరైన కనెక్టివిటీ మరియు భవిష్యత్తు ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విస్తత రహదారులను ప్లాన్ చేస్తే బాగుంటుందని, వాటర్‌లాగింగ్‌ను నివారించడానికి, పారిశుద్ధ్యాన్ని నిర్ధారించడానికి పారుదల వ్యవస్థలు అవసమని తెలిపారు. గృహ నిర్మాణం, వ్యవసాయం, ప్రజా సౌకర్యాలు, సమాజ స్థలాల కోసం క్రమబద్ధమైన భూ వినియోగం అవసరమన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలి

- సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు : అరకులో అక్టోబర్ 6, 7 తేదీలలో జరుగనున్న సిఐటియు అల్లూరి జిల్లా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన సిఐటియు జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో సిఐటియు అతిపెద్ద సంఘంగా గుర్తింపు తెచ్చుకుందని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు సమరశీలంగా నిర్వహించారన్నారు. అంగన్వాడి, ఆశ సమస్యలపై పోరాడి విజయం సాధించామన్నారు. ప్రభుత్వం కొన్ని సానుకూల నిర్ణయాలు చేయడం పట్ల కార్మికులు ఐక్య పోరాటాలతోనే సాధ్యమైందన్నారు. పోరాడ టంతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని కార్మికులు నిరూపించారని తెలిపారు. టూరిజం ఐటిడిఏ, మెడికల్ ఉద్యోగులు, కాఫీ కార్మికులు ప్రభుత్వ హాస్పటల్, శానిటేషన్ కార్మికుల సమస్యలపై ఇటీవల కాలంలో అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కార్మికులందరికీ వేతనాల పెంపు కోసం భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకై పెద్ద ఎత్తున కార్మికులంతా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అరకులో జరిగే మహాసభలో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమ ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, జిల్లా ఆఫీస్ బేరర్స్ ఎస్ బి పోతురాజు, మోస్యా, సత్యనారాయణ, శంకర్రావు, జీనబంధు, భాగ్యలక్ష్మి, ఎల్.సుందర్రావు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కోటేశ్వరరావు

నేటి నుంచి మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విశ్వేశ్వరరావు నాయుడు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎం అండ్ హెచ్ఓ

ప్రజాశక్తి-పాడేరు : మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పరిధిలోని 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో "స్వస్త్ నారి శక్త్ పరివార్ అభియాన్" (మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు) ఈనెల 17 నుండి అక్టోబర్ 2 వరకు రెండు వారాల పాటు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టి.విశ్వేశ్వరరావునాయుడు స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ, జిల్లా పరిధి 64 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించే శిబిరాల ద్వారా మహిళలకు సమయానుకూల వైద్య సేవలు, అవగాహన కార్యక్రమాలు, పోషకాహార సలహాలు, గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, తగిన చికిత్సలు, రెఫరల్ సేవలు అందించనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల పైబడిన మహిళలకు సాధారణ క్యాన్సర్లు, జీవన శైలి వ్యాధులపై స్క్రీనింగ్, గుండె జబ్బులు, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల పరీక్షలు, అవసరమైన చికిత్స/రెఫరల్ సేవలు, మహిళలు, కిశోర బాలికలలో రక్తహీనత గుర్తింపు, తగిన చికిత్స, గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు, పోషకాహారం పై కౌన్సిలింగ్, కిశోర బాలికలలో హిమోగ్లోబిన్ పరీక్షలు, సికిల్ సెల్ అనీమియా గుర్తింపు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు వంటి సేవలు అందించడం జరుగుతుందన్నారు. మహిళలు, బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ ఆరోగ్య పరిస్థితి ముందుగానే తెలుసుకొని అవసరమైన చికిత్సలు పొందాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రతాప్, జిల్లా ప్రోగ్రామ్ అధికారి రాజు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు :

మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఈనెల 19న స్వస్త నారి శశక్త్ పరివార్ అభియాన్ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సిహెచ్‌సి సూపరింటెండెంట్ గీతాంజలి మంగళవారం తెలిపారు. మహిళలకు స్క్రీనింగ్ చేయడానికి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ శిబిరానికి వైద్య నిపుణులు ఆస్తమాలజీ, చిన్నపిల్లల వైద్య నిపుణులు, జనరల్ వైద్య నిపుణులు పాల్గొంటారని తెలిపారు. స్క్రీనింగ్ ,కిడ్నీ, లివర్, హిమోగ్లోబిన్ ,తదితర రక్త పరీక్షలు చేయనున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గీతాంజలి విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయ సమస్యలపై 'రణభేరి'

- రంపచోడవరం డివిజన్‌లో ఉత్సాహంగా సాగిన యుటిఎఫ్ జాతా

రాజఒమ్మంగి : జీపుజాతా నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

అడ్డతీగల : యుటిఎఫ్ నేతలకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి, అడ్డతీగల, రంపచోడవరం విలేకరులు

విద్యారంగ, ఉపాధ్యాయరంగ సమస్యలు పరిష్కరించాలంటూ యుటిఎఫ్ ఆధ్వర్యాన తలపెట్టిన రణభేరి జాతా అల్లూరి జిల్లాలోని రాజవొమ్మంగి, అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం, దేవీపట్నం మండలాల్లో మంగళవారం సాగింది. కాకినాడ జిల్లా తునిలో సోమవారం ప్రారంభమైన ఈ జాతా ఏలేశ్వరం మీదుగా మంగళవారం రాజవొమ్మంగికి చేరుకుని పలు ప్రాంతాల గుండా ఉత్తేజభరితంగా నడిచింది. ఎక్కడికక్కడ ఈ జాతాకు అపూర్వ స్వాగతం లభించింది. తొలుత ఈ జాతాను రాజవొమ్మంగిలో సిఐ గౌరీశంకర్, ఎస్ఐ శివకుమార్‌లు అడ్డుకున్నారు. జాతాకు ఎటువంటి అనుమతీ లేదని, జెండాలు తీసివేయాలని చెప్పారు. శాంతియుతంగా చేస్తున్న జాతాను అడ్డుకోవడం తగదని యుటిఎఫ్ నేతలు అన్నారు. దీంతో పోలీసులు వెనక్కి తగ్గారు. తదుపరి మిగతా మండలాల్లో యాత్ర సజావుగా సాగింది. ఆయా చోట్ల జాతాను ఉద్దేశించి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు అరుణ కుమారి, రవి చక్రవర్తి మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఈ నెల 15 నుంచి 19 వరకు రణభేరి పేరిట రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న జాతాకు అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులపై అదనపు భారం మరింత పెరిగిందన్నారు. 15 నెలలు గడుస్తున్నా పిఆర్‌సి ప్రసక్తే లేదన్నారు. భారీగా పెరిగిన డిఎ బకాయిలను వెంటనే చెల్లించాలని, పిఆర్‌సి వేసి అమలు చేయాలని, సిపిఎస్ రద్దు చేయాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు కేవలం బోధన మాత్రమే ఉండేలా వాతావరణం కల్పించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 25న విజయవాడలో మహా నిరసన చేపడతామన్నారు. ఆయాచోట్ల జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు విజయకృష్ణ, కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, నగేష్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కష్ణ, తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, కోశాధికారి ఇవిఎస్.ప్రసాద్, గౌరవాధ్యక్షులు కృష్ణయ్య, నాయకులు ఎం.రమేష్, ఆదిరెడ్డి సూరిబాబు, నాగేశ్వరరావు, కె.శ్రీను, బొజ్జియ్య, సుబ్బారావు, కృష్ణ, జి.శ్రీను, లోవరాజు, వెంకటలక్ష్మి, ప్రసన్న, పైడుమల్లు, రమేష్, మంగరాజు, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ జాతా సింగంపల్లి, కొట్టంపాలెం, అడ్డతీగల సహా పలు ప్రాంతాల్లోని పాఠశాలలకు వెళ్లి అక్కడి ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంది.

నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి -సీలేరు: ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా జికె వీధి మండలం, సీలేరు ఎపి జెన్‌కో ఎస్ఇ కార్యాలయం ఎదుట భోజనం విరామ సమయంలో విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. విద్యుత్ జెఎసి జిందాబాద్ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. జెఎసి చైర్మన్ సత్తిబాబు, కన్వీనర్ ధార్రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిపిఎఫ్ తో కూడిన పెన్షన్ విధానాన్ని 1999 నుంచి 2004 వరకు నియమించబడ్డ ఉద్యోగులకు వర్తింప చేయాలన్నారు. విద్యుత్ ఉద్యోగులకు పెన్షనర్లకు వైద్యఖర్చులు జెన్కో యాజమాన్యం భరించాలన్నారు. గతంలో అంగీకరించిన విధంగా అన్ని విభాగాలను ఖాళీలను భర్తీ చేయాలని, అదనపు పోస్టులు మంజూరు చేయాలన్నారు. విద్యుత్ సంస్థలో ఉన్న అన్ని ట్రస్టులను బలోపేతం చేసి మూడు నెలలకు ఒకసారి ట్రస్ట్ అడ్వైజర్ కమిటీ మీటింగ్ ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ జెన్కో ఇంజనీర్లు విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి -కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం, చింతలపూడి పంచాయతీల్లో స్థానిక సర్పంచులు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు మంగళవారం స్మార్ట్‌రేషన్ కార్డులను పంపిణీ చేశారు. రాజేంద్రపాలెంలో సర్పంచ్ పీటా సింహాచలం, వైస్ ఎంపిపి అంబటి నూకాలమ్మ, వీఆర్ఓ సత్యనారాయణ, వెటర్నరీ అసిస్టెంట్ దాసు, కూటమి నేతలు సాగిన బుజ్జిబాబు, కాకర చిన్నారావు, సేల్స్ మాన్ సత్తిబాబు పాల్గొనగా, చింతలపూడిలో సర్పంచ్ రమాదేవి విఆర్ఓ వెంకాయమ్మ, కూటమి నేతలు కొర్రు రామమూర్తి, పోటుకూరి సన్యాసిరావు, మాజీ ఎంపిటిసి బాలరాజు కార్డులను పంపిణీ చేశారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి -కొయ్యూరు : ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ స్వస్థనారి స్వసక్తి పరివార అభియాన్ ప్రోగ్రాం రాజేంద్రపాలెం పిహెచ్‌సి పరిధిలో వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్టు వైద్యాధికారి హేమంత్ తెలిపారు. మహిళలకు వారి ఆరోగ్యంపై అవగాహన కల్పించ డమే దీని ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. అన్నిరకాల వైద్యపరీక్షలు పిహెచ్‌సిలో నిర్వహిస్తారన్నారు. కార్యక్రమాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ హేమంత్ కుమార్ సిహెచ్ఓ ప్రశాంత్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో భాగ్యవతి లక్ష్మిభూలోక హెల్త్ అసిస్టెంట్లు ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హేమంత్

బ్యాంకు లావాదేవీలపై అవగాహనకు జనసురక్ష

ప్రజాశక్తి-జీకేవీధి : మండలంలోని రింతాడ పంచాయతీ కడుగులలో సోమవారం యూనియన్ బ్యాంక్ మేనేజర్ గౌతమ్‌కుమార్ గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఖాతాదారుల వద్దకే బ్యాంకు ఉద్యోగులు గ్రామస్థాయిలో బ్యాంక్ సమస్యల్ని తీర్చే విధంగా రూపొందించారు. రైతుల లోన్లు, బీమా పథకాలు, సుకన్య సమృద్ధి యోజన, డ్వాక్రా సంఘాల ను సక్రమంగా ఎలా నడిపించాలని తదితర విషయాలను వివరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సిఎఫ్‌ఎల్ టీం (సెంటర్‌ఫర్ ఫైనాన్షియల్ లిటరసీ) రాజు, మహేష్, మూర్తి ,యుబిఐ బిసి పాయింట్ మహేష్, ఎపిజిబి బిసి పాయింట్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో వర్షం

ప్రజాశక్తి -కొయ్యూరు: మండల కేంద్రంలోని మధ్యాహ్నం ఒక్కసారిగా కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. మండల కేంద్రానికి వచ్చేందుకు పలువురు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారం రోజులుగా ప్రతిరోజు ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తూనే ఉందని వరి పంటకు యూరియా వేద్దామన్నా కుదరడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోదావరి ఎగపోటుతో పొంగిన సోకులేరు

-30 గ్రామాలకు స్తంభించిన రవాణా

ప్రజాశక్తి- చింతూరు : గోదావరి నది ఎగపోటుతో శబరినది బ్యాక్ వాటర్ ప్రభావంతో సోకులేరు వాగు మళ్లీ పొంగింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం వద్ద గోదావరి 38 అడుగులకు చేరి క్రమంగా తగ్గు ముఖం పట్టింది. ఈ ఏడాది మూడోసారి శబరి, గోదావరి నదులు పొంగి ప్రవహించాయి. జాతీయ రహదారులపై వరద నీరు రాకపోవడంతో చత్తీస్‌ఘడ్, ఆంధ్రా ఒడిస్సా తెలంగాణ రాష్ట్రాలకు యధావిధిగా రాకపోకలు సాగుతున్నాయి.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలి

ప్రజాశక్తి- జికె వీధి: మండలంలోని రింతాడలో గిరిజనేతరులు చట్టాలను ఉల్లంఘించి అక్రమంగా చేపడుతున్న పక్కా ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి వారిపై ఎల్‌టిఆర్ కేసు నమోదుచేయాలని ఉప సర్పంచ్ సోమేశ్‌కుమార్, గ్రామ కమిటీ కార్యదర్శి రాజేష్‌కుమార్, మల్లేష్, జనసేన పార్టీ ఉపాధ్యక్షులు అనిల్ మంగళవారం రెవిన్యూ అధికారి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామకంఠంలో పక్కా భవనాలు నిర్మాణలు చేపడుతున్నారన్నారు. ఇప్పటికైనా 5వ షెడ్యూల్లో ప్రాంతంలో 1/70 చట్టన్ని ఉల్లంఘించిన వారి చేపడుతున్న అక్రమ నిర్మాణాలు వెంటనే నిలిపివేయాలని, వారిపై ఎల్‌టిఆర్ కేసు నమోదు చేసి అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేయాలని డిమాండ్ చేశారు.

మారేడుమిల్లి పిహెచ్‌సి సిబ్బంది

మారేడుమిల్లి పిహెచ్‌సికి జాతీయస్థాయి గుర్తింపు

ప్రజాశక్తి- మారేడుమిల్లి: మారేడుమిల్లి పిహెచ్‌సికి నాణ్యతా ప్రమాణాల సేవకు జాతీయస్థాయి గుర్తింపు లభించిందని వైద్యాధికారి డాక్టర్ దినేష్‌వర్మ తెలిపారు. న్యూఢిల్లీ కి చెందిన (ఎన్‌క్యూఏఎస్) జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం మారేడుమిల్లి పిహెచ్‌సిలో మంగళవారం పర్యటించారు. దీనిలో భాగంగా బృందం సభ్యులైన డాక్టర్ అపర్ణభద్రషెట్టి (కర్ణాటక) ఉదరందేశ్ భతార్ (మహారాష్ట్ర) స్టేట్ (ఎన్‌క్యూఏఎస్)టీమ్ మెంబర్ డాక్టర్ రాజేష్ పిహెచ్‌సిని పరిశీలించి ఇక్కడ లభించే వైద్యసేవలు, అవుట్ పేషెంట్ విభాగం, ఇన్‌పేషెంట్ విభాగం ,లేబర్‌రూమ్, లేబరేటరీ సాధారణ పరిపాలన విభాగం పనితీరును పరిశీలించి నాణ్యతా ప్రమాణాలతో వైద్యం అందుతున్న సేవలను బృందం సభ్యులు గుర్తించడంతో జాతీయస్థాయిలో గుర్తింపు లభించిందని తెలిపారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ డేవిడ్ , శిరీష సిబ్బందిని అభినందించారు.

ఎంపిటిసిల గౌరవ వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి - జికే వీధి : మండలంలో ఎంపిటిసిల గౌరవ వేతనం 36 నెలలుగా అందలేదని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒకి వినతిపత్రం అందజేసినట్టు జికె వీధి వైస్ ఎంపిపి సప్పగెడ్డ ఆనందరావు, లోత దేముడు, ఎంపిటిసి భీమరాజు అన్నారు. సప్పగెడ్డ ఆనందరావు మాట్లాడు తూ మండలంలో 16 పంచాయ తీల్లో 18 మంది ఎంపిటిసిలకు 36 నెలలుగా వేతనాలు అందలేదన్నారు. ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒకి వినతిపత్రం అందించారు.

డిప్యూటీ సిఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఎంపిటిసిలు

క్షౌరవృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: క్షౌరవృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని వారి సమస్యలు పరిష్కరించాలని సంఘం నాయకులు టి.శ్రీను తదితరులు అన్నారు. రాజవొమ్మంగిలో మంగళవారం క్షౌర వృత్తిదారుల దినోత్సవం నాయిబ్రాహ్మణ కమిటీ కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షులు త్రిమూర్తులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కరాసు అప్పారావు జెండా ఆవిష్కరించారు. సంఘం నేతలు ఎర్రవరం శ్రీను తదితరులు మాట్లాడుతూ తమకు ప్రభుత్వం వైద్యబీమా వర్తింపచేయాలని, ఎక్కువగా కంటి సమస్యలు వస్తున్నాయని 50 సంవత్సరాలు నిండిన మా వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాబురావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

పిఒకు వినతిపత్రాన్ని ఇస్తున్న పశువైద్యాధికారులు

పశు వైద్యశాలల మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-అనంతగిరి: పశు వైద్య శాలల మరమ్మతులు చేపట్టాలని కోరుతూ పాడేరు ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ కు మంగళవారం అల్లూరి జిల్లా పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షులు సాగిరి. గణేశ్వరరావు ఆధ్వర్యంలో బృందం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడేరు డివిజన్‌లో 70 శాతం పశు వైద్యశాలల భవనాలు శిథిలావస్థలో చేరి కూలి పోయే ప్రమాదంలో ఉన్నాయన్నారు. దీంతో మందులు, టీకాలు భద్రపరచుకోవడానికి వీలు లేకుండా పోతుందన్నారు.పాడేరు డివిజన్ లో ఉన్న పశుసంవర్థకశాఖ లో రెండు ఏరియా పశువుల ఆసుపత్రులు, పందొమ్మిది పశు వైద్యశాలలు, పది గ్రామీణ పశువైద్య కేంద్రాల మరమ్మతులు చేపట్టాలని కోరారు. కొత్తభవనాలు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి జయరాజు , సహాయ సంచాలకులు పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి ఘన సన్మానం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ప్రాథ మిక కేంద్రంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీ అయిన హెల్త్‌అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, పిహెచ్ఎన్, హెల్త్ సూపర్వైజర్లను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పి రాంబాబు, అంబికా, ఎంపి హెచ్ ఓ సన్యాసిరావు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్తులు

రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలం పెదలబుడు మేజర్ పంచాయతీ శరభగూడ నుండి ఎన్టీఆర్ విగ్రహం మెయిన్ రోడ్డు వరకు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని మంగళవారం శరభగూడ గ్రామస్తులు స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంకు వినతి పత్రాన్ని అందజేశారు. శరభగూడ గ్రామం నుండి ఎన్టీఆర్ విగ్రహం మెయిన్ రోడ్ వరకు సిసి రోడ్ లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వర్షాకాలంలో ద్విచక్ర వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. నిత్యం ఉద్యోగస్తులు, విద్యార్థులు, గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారని, రోడ్డు బురదమయంగా ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు.స్పందించిన ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సీసీ రోడ్లు నిర్మాణానికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శరభగుడ క్లస్టర్ పేసా ఉపాధ్యక్షుడు కిల్లో జగన్నాథ్, శరభగుడ గ్రామస్తులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీలో ఆదివాసీలకు అన్యాయం

ప్రజాశక్తి-పాడేరు: డీఎస్సీ 2025 ఉపాధ్యాయ పోస్టుల తుది ఎంపిక జాబితాలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ యువతకు తీవ్రమైన అన్యాయం జరిగిందని ఆదివాసీ నిరుద్యోగ సంఘం అల్లూరి జిల్లా కన్వీనర్ సాగిన సత్యనారాయణ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ డీఎస్సీలో గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో 881 పోస్టులు కేటాయించినా స్థానిక ఆదివాసీ అభ్యర్థులకు సరైన అవకాశాలు లభించలేదని చెప్పారు. ఈ అన్యాయానికి నైతిక బాధ్యత వహిస్తూ, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.లేకుంటే ఈనెల20న మంత్రి క్యాంప్ ఆఫీస్‌ని ముట్టడిస్తామని వెల్లడించారు. రాజ్యాంగం ప్రకారం ఎస్టీలకు 7.5శాతం వర్టికల్ రిజర్వేషన్, జిల్లా స్థాయి పోస్టులలో 80శాతం స్థానికులకు కోటా కేటాయించబడినప్పటికీ, ఆచరణలో అవి అమలు కాలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సౌకర్యాలు తక్కువగా ఉండటంతో దరఖాస్తు ప్రక్రియ కష్టమయ్యిందన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ దశలో 30 మంది పైగా ఆదివాసీ అభ్యర్థులు తిరస్కరించబడ్డారన్నారు. స్థానిక ఏజెన్సీ సర్టిఫికెట్లు, ఎస్టీ రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకోలేదన్నారు.గత 15 సంవత్సరాలుగా గిరిజన సంక్షేమ గురుకులాల్లో 3,000 మంది పైగా ఔట్‌సోర్సింగ్ టీచర్లు పనిచేస్తున్న ఆదివాసీలకు డీఎస్సీలో వెయిటేజ్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు.మార్కుల సవరణలు, వెరిఫికేషన్‌లో ఆలస్యంతో ఆదివాసీలు నష్టపోయారని, ఏజెన్సీ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్య మరింత తీవ్రతరమైందన్నారు. ఆదివాసీలకు జరిగిన ఈ తీవ్రమైన అన్యాయాల పై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి, తక్షణం రాజీనామా చేయాలన్నారు.రాజీనామా చేయకపోతే, ఆదివాసీ నిరుద్యోగ సంఘం ఈనెల 20న మంత్రి క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడానికి పిలుపు నిస్తుందన్నారు. ఈ ఆందోళనలో ఏజెన్సీ ప్రాంతాల నుంచి వేలాది మంది ఆదివాసీ యువత పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో మండలాల ఆదివాసి నిరుద్యోగ సంఘం ప్రతినిధులు, నిరుద్యోగ గిరిజన యువత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సంఘం నేతలు

తాగునీటి సమస్యపై ఖాళీ బిందెలతో ఆందోళన

ఆందోళన చేపడుతున్న మహిళలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఆంధ్ర ఒడిశా సరిహద్దు గ్రామం.. మండలంలోని కురిడి పంచాయితీ పితమరిగూడ గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామస్తులు మహిళలు ఖాళీ బిందెలతో గ్రామంలో మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ మాట్లాడుతూ, గ్రావిటీ పథకం మరమ్మతుకు గురవడంతో ఆ గ్రామస్తులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం విచారకర మన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్తులు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరతపై ఎమ్మెల్సీకి వినతి

ప్రజాశక్తి-చింతపల్లి : ఉపాధ్యాయుల కొరత కారణంగా గిరిజన సంక్షేమ పాఠశాలలు, జిల్లా పరిషత్ హైస్కూళ్లలో విద్యార్థుల బోధన తీవ్రంగా దెబ్బతింటోందని పిఆర్టియు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు చింతపల్లిలో మంగళవారం జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడుకు పిఆర్టియు రాష్ట్ర కౌన్సిలర్ కొర్రు మత్స్యలింగం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మత్స్యలింగం మాట్లాడుతూ ఉపాధ్యాయ- విద్యార్థుల నిష్పత్తి ప్రకారం సబ్జెక్టు, లాంగ్వేజ్ టీచర్లు లేకపోవడంతో ఒక్కరే పలు తరగతులకు బోధించవలసి వస్తోందని పేర్కొన్నారు. మూల్యాంకన విధానం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు లేకపోవడంతో మూడు నుంచి ఐదు తరగతులను స్కూల్ అసిస్టెంట్లు బోధించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసరంగా విద్యా వాలంటీర్లుగాని, కాంట్రాక్ట్ రెసిడెన్స్ టీచర్లుగాని నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు నాయకులు యు.వి. గిరి, ప్రసాద్, సాగిన రామరాజు పడాల్, రోబ్బ వెంకటరమణమ్మ, సత్తిబాబు, వసుపరి సామ్యూల్, కిముడు దామోదర్, లకే నాగేష్ కుమార్, కోరారు చలపతిరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పెదబొడ్డేపల్లి పంచాయతీ ఆఫీస్ వద్ద ఓ ఇంటిలో జరిగిన చోరీ కేసులోని ఇద్దరు నిందితులను అరెస్టు చేశామని టౌన్ సీఐ గోవిందరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలు ప్రకారం.. పెదబొడ్డేపల్లిలో ఉంటున్న ఉద్దండం దేవుడులమ్మ ఇంటి పెరటిలో బ్రష్ చేస్తుంది. ఆ సమయంలో వెనుక నుండి దుర్గ భవాని అనే మహిళ వచ్చి దేవుడులమ్మ మెడలోని పుస్తుల తాడు లాక్కొని వెళ్తున్న సమయంలో కాపాడుకునే ప్రయత్నంలో దేవుడులమ్మ కింద పడటంతో తలకు దెబ్బ తగిలింది. దుర్గభవాని తప్పించుకొని పారిపోయింది. గాయాలపాలైన దేవుడులమ్మను ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా మంగళవారం దుర్గా భవానితో పాటు ఈ కేసులో బంటు భాస్కరరావుని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 28.530 గ్రాముల బంగారు తాడును స్వాధీనం చేసుకుని ఇద్దరినీ రిమాండ్ కు తరలించామని సిఐ గోవిందరావు తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ప్రజాశక్తి-యలమంచిలి : పట్టణంలోని టిడ్కో కాలనీ సమీపంలోని నూతిలో వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం ఉదయం గుర్తించారు. మృతుని సంచిలో ఉన్న గుర్తింపు కార్డును బట్టి అతని బంధువుల ఫిర్యాదు మేరకు మృతుడిని అప్పికొండ రమణగా పోలీసులు గుర్తించారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సబ్ ఇనస్పెక్టర్ సావిత్రి తెలిపారు. బంధువులిచ్చిన సమాచారం మేరకు మృతుడు రమణ టాక్సీ నడిపేవారని, భార్యతో 15 ఏళ్ల క్రితమే విడిపోయి స్థానిక ఫైర్ ఆఫీసు కాలనీలో తల్లి దగ్గర ఉండేవాడని పేర్కొన్నారు. మద్యానికి బానిసై తల్లిని కొట్టేవాడని, ఇతని బాధలు భరించలేక తల్లి అచ్యుతాపురంలోని కూతురు దగ్గరకు వెళ్లి పోవడంతో దిక్కులేనివాడయ్యాడని తెలిపారు. తిండికి కూడా కరువై సోమవారం సాయంత్రం అప్పికొండ జోగినాయుడు నూతిలో పడి చనిపోయినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అతని బంధువుల సమాచారం ప్రకారం మృతుడు కొంత కాలంగా మతిస్థిమితం లేక తిరుగుతూ తిండికి కూడా కరువై ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని భావిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని తునివలస గ్రామ దేవత బంగారమ్మ ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. మంగళవారం తెల్లవారుజామున ఆలయం తెరిచేందుకు చావక్రాలు వెళ్లగా తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించారు. సమీపంలో ఉన్న వారిని ఆమె పిలిచి విషయం తెలియజేశారు. అమ్మవారు ఆలయం హుండీలోని ఆదాయాన్ని మాత్రమే చోరీ చేశారు. రూ.లక్ష విలువ చేసే వెండి కిరీటం ఉన్నప్పటికీ దొంగలించలేదు. దీనిపై పోలీసులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. విశాఖపట్నం నుండి క్లూ టీం వచ్చి ఆలయంలో ఆధారాలు సేకరించారు.

ఆందోళన చేపడుతున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల సమస్యలపై నిరసన

ప్రజాశక్తి-పాడేరు: ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆ సంఘం జిల్లా అధ్యక్షులు రావుల జగన్ మోహన రావు అధ్యక్షతన ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ డిఎలను వెంటనే విడుదల, పాత పెన్షన్ అమలు, 12వ పిఆర్సి కమీషన్, 30శాతం ఐఆర్ తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంసుందర్, జిల్లా కార్యదర్శి. చిన్నారావు, పాడేరు మండల అధ్యక్షులు పోతురాజు, హుకుంపేట అధ్యక్షులు. సత్యారావు, జి.మాడుగుల జిల్లా కౌన్సిలర్. రంజన్ కుమార్,. భైరవ మూర్తి పాల్గొన్నారు.

పిట్టలపాడులో ఎన్ఆర్ఎస్‌టిసి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు: కొయ్యూరు మండలంలోని పిట్టలపాడులో నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో బడికి వెళ్లే పిల్లలు సుమారు 25 మంది ఉన్నారని అయితే గ్రామంలో పాఠశాల లేక గరిమండ పాఠశాలకు వెళ్తున్నారని వాపోయారు. వెంటనే పిట్టలపాడు గ్రామంలో ఎన్ఆర్ఎస్‌టిసి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వరద గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: ఎంపిడిఒ కార్యాలయంలో ఇంటిపన్నుల బకాయిల వసూలు, సిసి చార్జీల చెల్లింపుపై డిఎల్‌పిఒ సుబ్బారావు మంగళవారం సమీక్ష నిర్వహించారు. వీఆర్.పురంలో ఎంపిడిఒ కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత అధికారులతో చర్చించారు. పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం చోటుచేసుకోరాదని సూచించారు. తరువాత అన్నవరం వాగు పరిసర గ్రామాలను పరిశీలించారు. బాధితులతో మాట్లాడిన అనంతరం తక్షణం శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని సచివాలయ సిబ్బంది, పంచాయతి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఎంపిడిఒ ఇమ్మానియేల్, రేకపల్లి పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాన్ని తిరిగి నిర్మించాలి

ప్రజాశక్తి- కొయ్యూరు : కొయ్యూరు మండలం, మర్రివాడ పంచాయతీలోని లూసం గ్రామంలో అంగన్వాడీ భవన నిర్మాణం పునాది స్థాయిలోనే నిలిచిపోయిందని సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి కాలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇంటిలోనే నిర్వహించాల్సి వస్తోందని, దీంతో పిల్లలు సిబ్బందికి అవస్థలు పడుతున్నారని తెలిపారు. సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించి, అంగన్‌వాడి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

జెడ్‌పి హైస్కూల్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - అడ్డతీగల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఇఒ బ్రహ్మాజీరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. ఎస్ఆర్‌కెవి ఎంకిట్స్ బయోమెట్రిక్ అటెండెన్స్ 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఇఒ శ్రీనివాసరావు, హెచ్ఎం వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, నాగమణి పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేస్తున్న డిఇఒ

అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

'ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలి'

ప్రజాశక్తి- చింతూరు : ఓజోన్‌పొరను పరిరక్షించుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయనికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్‌పొర పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓజోన్ పొర క్షీణత వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా ఓజోన్‌పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. కాలుష్యం పెరిగిపోతుండడంతో ఓజోన్‌పొర క్షీణించిపోతోందన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్, రసాయనశాస్త్ర విభాగాధిపతి శకుంతల, సీనియర్ అధ్యాపకులు వెంకటరావు, అప్పనమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

పూడిక తీయని డ్రైయినేజీలో పేరుకుపోయిన చెత్త

పంచాయతీ కార్యాలయానికి సమీపంలో చెత్త

ప్రజాశక్తి- రంపచోడవరం: పంచాయతీలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయానికి కేవలం పది అడుగుల దూరంలోనే రంపరోడ్డు వద్ద పారిశుధ్యం క్షీణించిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రహదారులు మాత్రం తుడుస్తున్నారని, వీధులు చెత్తతో నిండిపోతున్నాయని ముఖ్యంగా రెడ్డిపేట,రంపరోడ్డు, సీతంశెట్టి నగర్ ఎస్టీ కాలనీల్లో చెత్త పేరుకుపోవడమే దీనికి నిదర్శనమన్నారు. డ్రైనేజీలు కూడా శుభ్రం చేయకపోవడంతో ఏ మాత్రం వర్షం కురిసినా నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతోందని గ్రామస్తులు తెలిపారు. పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన లేదని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కోల్డ్‌స్టోరేజ్ ఏర్పాటు చేయరూ..!

ప్రజాశక్తి -సీలేరు: గిరిజన ప్రాంతాల్లో కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పంటలు నిలువ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజ్ లేక రైతులు దళారీ చేతిలో మోసపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. కోల్డ్‌స్టోరేజ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా పరిధిలో గిరిరైతులు రాజ్మా, చిక్కుళ్ళు, కాఫీ మిరియాలు, చింతపండు, పసుపు, అలుసులు తదితర పంటలు విరివిగా పండిస్తారు. అయితే వాటిని నిలువ చేసుకోవటానికి గోదాములు లేక కోల్డ్‌స్టోరేజీలో దాచుకునే అవకాశం లేక తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అరకు, పాడేరు, చింతపల్లిలో కోల్డ్‌స్టోరేజీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న జెన్‌కో ఎడిఇ

విద్యార్థులకు క్రీడాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-సీలేరు: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ చేశామని ఎపి జెన్కో ఇంజనీరింగ్ అసోసియేషన్ కార్యదర్శి (ఎడిఇ మెకానికల్) శ్రీనివాసరావు వెల్లడించారు. స్థానిక విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడుతూ సీలేరు బాలికల ఆశ్రమ పాఠశాల కాన్వెంట్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎంపిపి స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యూసిఐఎం హాస్టల్ విద్యార్థులకు క్రీడాసామగ్రి పంపిణీ చేశామని తెలిపారు. జెన్కో ఇఇ రాజేంద్రప్రసాద్ ఎడిఇలు, ఎఇలు, ట్రెజరర్ సిహెచ్ సురేష్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకరరావు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అందని నిత్యావసరాలు

ప్రజాశక్తి -విఆర్‌పురం: మండలంలో గోదావరి, శబరి పొంగటంతో రాకపోకలు నిలిచిపోయాయని ఇంతవరకూ వరద బాధితులకు బియ్యం కూడా అందించలేదని చిన్న మట్టపల్లి పంచాయతీ సర్పంచ్ పిట్ట రామారావు, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కోటం జయరాజు అన్నారు. 25 కిలోలు బియ్యం ప్రతి కుటుంబానికి ఇవ్వాలన్నారు.

ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మ్యూచువల్ ఫండ్స్ ద్వారా పెట్టుబడిదారుల విద్య ,అవగాహన కార్యక్రమం మంగళవారం విశాఖపట్నం సిరిపురంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్స్ అధికార ప్రతినిధి సతీష్ మాట్లాడుతూ ఒకప్పుడు ఫిక్స్ డిపాజిట్లుతో నడిచిన మార్కెట్‌లు ఇప్పుడు మ్యూచువల్ ఫండ్స్‌తో ముందుకు వెళు తున్నాయన్నారు.కొత్తగా మ్యూచువల్ ఫండ్స్‌లో చేరే వారి సంఖ్య అధికంగా ఉందని అత్యధికంగా 25-40 ఏళ్ల వయసు గలవారు ఉన్నారని ఆయన అన్నారు. ఇందులో నెలవారి పెట్టుబడి రూ.500 నుండి 2000 వరకు ఉందని డిజిటల్ వేదికలు, ప్రచార కార్యక్రమాల కారణంగా పెట్టుబడి రంగంలోకి ఎక్కువ మంది మహిళలు వస్తున్నారన్నారు. పెట్టుబడిదారులు మార్కెట్ ఒడిదుడుకులకు భయపడకుండా ఎస్ఐపిలను కొనసాగించాలని ఎస్ఐపి ఫైలు నిర్వహించే వారికి సెబి పూర్తి సహకారం అందిస్తుందని ఏదైనా సమాచారాన్ని ధృవీకరించుకునేందుకు https://www.sebi.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్ల ఆర్థిక సాయానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని ఆటోరిక్షా, క్యాబ్, మ్యాక్సీక్యాబ్ డ్రైవర్లకు ఆర్థికసాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసిందని, జిఒ33,36 ప్రకారం రూ.15వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 17 నుండి దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. 19 వరకు మాత్రమే కొత్త లబ్దిదారుల నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. 24వ తేదీకి తుది లబ్ధిదారుల జాబితా రూపొందించబడుతుందని, అక్టోబర్ 1న ముఖ్యమంత్రి చేతుల మీదుగా అర్హులైన డ్రైవర్ల ఖాతాల్లోకి నేరుగా ఆర్థిక సహాయం జమ చేయబడుతుందని పేర్కొన్నారు.

నవజాత శిశువుకు అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లో నవజాత ఆడ శిశువుకు అరుదైన శస్త్ర చికిత్సను మంగళవారం విజయవంతంగా నిర్వహించారు. వైద్యులు అందజేసిన సమాచారం ప్రకారం ఎంఎస్ఆర్ జిల్లా జి.మాడుగుల మండలం జి. కొత్తూరుకు చెందిన వండలము శ్రీనివాసు, సత్యవతి దంపతులకు ఈ ఏడాది జూలై 31న గెమిలి పిహెచ్‌సిలో జన్మించిన నవజాత ఆడ శిశువు తలవెనుక భాగంలో పెద్దగడ్డ ఉందని అక్కడ వైద్యులు కెజిహెచ్‌కు రిఫర్ చేశారు.ఎంఆర్ఐ స్కాన్‌లో శిశువుకు జెయింట్ ఆక్సిపిటల్ మెనింజోఏన్సఫలోసిల్ ఉందని గమనించి కెజిహెచ్ న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎం.ప్రేమ్‌జిత్‌రే అధ్వర్యంలో న్యూరోసర్జరీ వైద్యబృందం ఈ నెల 6వ తేదీన శస్త్రచికిత్స నిర్వహించారు. జన్యుపరమైన,ఇతర కారణాల వల్ల ఇలా వస్తాయని తెలిపారు. పేషెంట్ ప్రతి నెల న్యూరోసర్జరీ విభాగానికి క్రమం తప్పకుండా రావాలని తెలిపారు. వైద్య సిబ్బందిని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డిప్యూటి సూపరింటెంటెండ్ డాక్టర్ డి.రాధాకృష్ణన్, సిఎస్ఆర్ఎమ్ఓ డాక్టర్ యు.శ్రీహరి, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి అభినందించారు.

పోర్టులో నెదర్లాండ్ బృందం పర్యటన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారత్‌లోని నెదర్లాండ్స్ రాయబారి మారిసా గెరార్డ్స్ నెదర్లాండ్స్ ఎంబసీ ప్రతినిధి బృందం మంగళవారం విశాఖపట్నం పోర్ట్ అథారిటీని సందర్శించారు. పోర్ట్ డిప్యూటీ ఛైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దూబే, కార్యదర్శి టి. వేణుగోపాల్ ఇతర ముఖ్య అధికారులతో కలిసి రాయబారి బృందానికి ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం పోర్ట్ కార్యకలాపాలు, వ్యూహాత్మక ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలను రాయబారి బృందానికి వివరించారు. పోర్ట్‌లో మౌలిక సదుపాయాలు, సరుకు నిర్వహణ సామర్థ్యం, ఆధునీకరణ, యాంత్రీకరణ చర్యలు, కవర్డ్ స్టోరేజ్ సౌకర్యాలు, సౌరశక్తి వినియోగం, పారిశ్రామిక అవసరాల కోసం ఎస్‌టిపితో నీరు పునర్వినియోగం వంటి అంశాలను రాయబారికి వివరించారు. పోర్టులో ఉన్న పెట్టుబడి అవకాశాలు, విశాఖపట్నం పోర్ట్ ద్వారా దిగుమతి, ఎగుమతి కార్యక్రమాలను మరింత అభివృద్ధి చేసే మార్గాలపై చర్చించారు. పోర్ట్ మేనేజ్‌మెంట్‌ను నెదర్లాండ్స్ రాయబారి మారిసా గెరార్డ్స్ అభినందించారు.

భవన నిర్మాణ కార్మికుల వినతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వెల్ఫేర్‌బోర్డులో పెండింగ్ లో ఉన్న 50 వేల క్లైములను వెంటనే పరిష్కరించి, భవన నిర్మాణ కార్మికులకు నగదు చెల్లించాలని రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి పడాల రమణ కోరారు. మంగళవారం దక్షిణ ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కొత్తసభ్యుల నమోదు సరళతరం చేసి వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని పాతకార్డులు రెన్యువల్ చేయాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు కోట సత్తిబాబు, నాయకులు సాయిబాబా, బోర రమణ తదితరులు ఉన్నారు.

'పోర్టు కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలి'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో సమస్యల పరిష్కారంలో విశాఖ పోర్టు తరపున సహాయం అందించాలని, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం పోర్ట్ చైర్మన్ డాక్టర్ అంగముత్తును కోరారు. ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వంగా కలిసారు. నియోజవర్గంలోని ఎస్ఎల్ కాలువ నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. కాలుష్యం నివారణకు గ్రీనరి ఏర్పాటు చేయాలని కోరారు. పోర్టు కాలుష్యం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లారు. అదేవిధంగా ఎస్ఎల్ కాలువ పూర్తి చేయడానికి సహకారం అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. పోర్ట్‌చైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

అధ్యయన యాత్రకు జివిఎంసి కార్పొరేటర్లు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ కార్పొరేటర్లు, పలువురు అధికారులు అధ్యయన యాత్రకు మంగళవారం విశాఖ నుండి బయలుదేరి వెళ్లారని జివిఎంసి కార్యదర్శి బి.వి.రమణ పత్రికా ప్రకటనలో తెలిపారు. మేయర్ పీలా శ్రీనివాసరావుతో పాటు 82 మంది కార్పొరేటర్లు, పలువురు అధికారులు మంగళవారం విశాఖ విమానాశ్రయం నుండి అధ్యయన యాత్రకు బయలుదేరారని తెలిపారు. వీరిలో 43 మంది మహిళా కార్పొరేటర్లు కూడా ఉన్నారు. కార్పొరేటర్ల బృందం 16న విశాఖపట్నంలో బయలు దేరి 24వ తేదీ వరకూ జైపూర్, జోథ్‌పూర్, జైసల్మీర్, ఢిల్లీ ప్రాంతాల్లోని మున్సిపల్ కార్పొరేషన్‌లు అధ్యయనం చేసిన అనంతరం నగరానికి తిరిగి వస్తారని తెలిపారు.